క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్ సరిత



కౌన్సిలర్ సరితకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 5వ వార్డు కౌన్సిలర్ అలక సరిత గురువారం రాత్రి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అలక సరితకు కాంగ్రెస్ పార్టీ అలక మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి, కౌన్సిలర్లు బచ్చలకూరి ప్రకాశ్, రణపంగ నాగయ్య, నూకల సుగుణమ్మ, నాయకులు పాండునాయక్, కోటేశ్వర్ రావు, అజయ్, సైదులు, సైదా, శ్రీను, సైబాల్ తదితరులు ఉన్నారు.

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీజ్ఞాన సరస్వతీ దేవాలయంలో ఈనెల 17 నుంచి జనవరి 16వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో పూజారి దామోదరాచార్యులు వేద మంత్రాలతో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, పల్లకీసేవ, విశేష అర్చనలు, తురుప్పావై ప్రవచనం నిర్వహించనున్నారు. 17న ధనుర్మాస ప్రతారంభం, 23వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం, 31న అభిషేకం, లక్ష కుంకుమార్చన, జనవరి 12న కూడారై ఉత్సవం, 108 గంగాళాలతో పాయసం నివేదన, 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పి.సోమ లక్ష్మమ్మ, గౌరవ అధ్యక్షులు వి.పవన్‌కుమారాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

విడతల వారీగా సాగు నీరు విడుదల చేయాలి

గరిడేపల్లి : సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి సాగుకు విడతల వారీగా నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాగర్ ప్రాజెక్ట్‌లో నీళ్లు ఉండి కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం వానాకాలం సీజన్‌లో నీళ్లు ఇవ్వలేదని దీంతో వేల ఎకరాల భూములు బీడులుగా మారాయన్నారు. యాసంగిలో కనీసం రెండు, మూడు సార్లు నీరు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపితే భూగర్భజలాలు పెరిగి కనీసం బోర్లు, బావుల కిందనైనా రైతులు పంటలు పండించుకుంటారని తెలిపారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం



పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ, గ్రామపెద్దలు

నడిగూడెం : మండల పరిధిలోని చాకిరాలలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, సర్పంచ్ యాతాకుల వీరస్వామి, ఉత్సవ కమిటీ చైర్మన్ మొగలగాని వెంకటేశ్వర్లు, సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

లోక్‌సభ ఘటన పాలకుల అసమర్థతకు నిదర్శనం

నేరేడుచర్ల : పార్లమెంటుపై అగంతకులు దాడి చేయడం దేశాన్ని పాలించే పాలకుల అసమర్థతకు నిదర్శనం అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దూళిపాల ధనుంజయనాయుడు అన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంటునే కాపాడుకోలేకపోయిందని, దేశాన్ని ఏవిధంగా కాపాడుతుందని అన్నారు. లోక్ సభలో స్మోక్ బాంబు ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ హోంమంత్రి పదవికి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకుడు గోరుగంతం శ్రీను అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సింహాద్రీ, పట్టణ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి, రావుల సత్యం, ఎ.లక్ష్మి, చిలక రాజు శ్రీను తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

అర్వపల్లి : హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి బద్దం యాదగిరిగౌడ్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు.

పల్లె రథం.. కనుమరుగు

- గ్రామాల్లో తగ్గిన ఎడ్లబండ్ల వాడకం
- పెట్టుబడులు పెరిగినా ఆధునిక యంత్రాలపైనే రైతన్న మోజు



నడిగూడెంలో నిరుపయోగంగా ఉన్న ఎడ్ల బండి



వేణుగోపాలపురంలో ఎడ్లబండి నడుపుకుంటూ వెళ్తున్న రైతు

నడిగూడెం : పల్లె రథం కనుమరుగవుతోంది. గ్రామీణ ప్రాంత రైతన్నల జీవితాల్లో మమేకమై, పల్లె ప్రజలకు సేవలందించిన ఎడ్లబండి యాంత్రిక జీవనంతో క్రమేపి వారి జీవితం నుంచి దూరమవుతూ వస్తోంది. సేద్యం పనులకు, సరుకుల రవాణా, ప్రజల ప్రయాణానికి ఎంతగానో ఉపయోగపడిన ఎడ్ల బండి ఇక కనుచూపు మేరలో కనిపించే అవకాశమున్నదని గ్రామీణ ప్రజలు భావిస్తున్నారు. పూర్వం రైతు ఇంటి ముంగిట ఉండే కాడెద్దులు, బండ్లను విలువైన ఆభరణాలుగా భావించేవారు. మారుతున్న కాలానికి అనుగుణంగా యాంత్రికత పెరుగుతుండడంతో క్రమేణ ఎడ్ల బండ్ల వాడకం తగ్గుతూ వస్తోంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఎడ్ల బండికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు విరామం కల్పించడమే కనుమరుగయ్యేటట్లు చేశాయి.

యంత్రాల రంగ ప్రవేశంతో..

గతంలో తొలకరి వర్షాలు కురవగానే రైతన్నలు నాగలి, పలుగు, పార తదితర వ్యవసాయ పనిముట్లను ఎడ్ల బండిపై పెట్టుకుని పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యేవారు. ప్రస్తుతం పొలం దుక్కి దున్నేటప్పటి నుంచి పంట కోత వరకు యంత్రాలు రంగ ప్రవేశం చేయడంతో ఎడ్ల బండితో పాటు, పురాతన వ్యవసాయ పనిముట్లు సైతం కనుమరుగయ్యాయి. క్రమేపీ వీటి జాడ కనిపించకుడా పోతుండడంతో భావితరాల వారు ప్రదర్శన శాలల్లో మాత్రమే చూడాల్సిన పరిస్థితి ఏర్పతుందని పలువురు పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునీకరణతో పెనుభారం



“ ఆధునీకరణ పేరుతో మనల్ని మనం వంచించుకుంటున్నాం. ప్రాచీన వ్యవసాయ పద్ధతులు అన్నదాలను ఎంతో మేలు చేశాయి. ప్రస్తుతం యంత్రాలు, రసాయన ఎరువులు వాడకం మూలంగా వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడం, ఆరోగ్యం చెడిపోవడంతో ఆర్థిక భారం కూడా పడుతోంది.

– పేరెల్లి గోపయ్య, రైతు, చెన్నకేశ్వాపురం

12 ఏళ్లుగా ఎడ్లబండి ఉపయోగిస్తున్నాను



“ 2012 ఏడాది నుంచి నాలుగు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. నాటి నుంచి ఎలాంటి ట్రాక్టర్ పరికరాలను ఉపయోగించుకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. గడ్డి, ధాన్యం కూడా ఎడ్ల బండిపైనే తరలిస్తున్నాను. ఖర్చులు కూడా లేవు.

– నాగిరెడ్డి వెంకటరెడ్డి, ప్రకృతి వ్యవసాయ రైతు, నారాయణపురం

ఉత్తమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రి ఉత్తమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సాముల జైపాల్‌రెడ్డి, ఎంపీపీ తదితరులు



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బాణాల కవిత, తదితరులు

హుజూర్‌నగర్ రూరల్ : రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పీసీసీ వ్యూహ, ప్రణాళిక కమిటీ సలహాదారు, ఎస్ఆర్ఐ సాముల జైపాల్‌రెడ్డి, హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ గురువారం సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మఠంపల్లి మాజీ జెడ్పీటీసీ సింగారపు అరుణసైదులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్తమ్ దంపతులకు శుభాకాంక్షలు

నడిగూడెం : రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖల మంత్రిగా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని, అలాగే కోదాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన పద్మావతిని గురువారం నడిగూడెం జెడ్పీటీసీ సభ్యురాలు, జిల్లా పరిషత్ సోషల్ అండ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బాణాల కవిత వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు బాణాల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండు విజయరామారావు ఉన్నారు.

స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

హుజూర్‌నగర్ : కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు శీతల రోషపతి అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యావసర ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. గతంలో మున్సిపల్, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులు, వీఆర్ఏలు, స్కీమ్ వర్కర్లు సమ్మెలు చేసినా గత ప్రభుత్వం దౌర్జన్యంగా వారిని అణిచి వేసిందని అన్నారు. మున్సిపల్ వర్కర్లు ముత్తమ్మ, దుర్గారావు సైదులు, చంద్రకళ, నాగరాజు, వెంకన్న, కుమారి, దేవకరణ రాంబాయి, రవి, చంటి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న సిబ్బంది

నడిగూడెం : పోస్టల్ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని పలువురు నాయకులు కోరారు. గురువారం స్థానిక పోస్టల్ శాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్.నజీరుద్దీన్, దున్నా వీరబాబు, వి.దుర్గాప్రసాద్, ఉప్పలయ్య, కొల్లు పుల్లయ్య చౌదరి, గండమల్ల వెంకన్న, అహ్మద్ షరీఫ్, శరత్, రామనర్సయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పొలం వద్ద కూలీల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

హుజూర్‌నగర్‌రూరల్ : ఉచిత వైద్య శిబిరాలను లేబర్ కార్డు (బీఓసీ) కలిగిన భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ శాసనాల నాగసైదయ్య కోరారు. గురువారం మండలంలోని గోపాలపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సీఎస్‌సీ వైద్య శిబిరాన్ని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాగా, సీఎస్‌సీ హెల్త్ క్యాంప్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో లేబర్ కార్డు ఉన్న 140 మంది కార్మికులకు 52 రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో కాల్వ వెంకటేశ్వరరావు, కొండయ్య, ఇందిరమ్మ, క్యాంపు సభ్యులు ప్రశాంత్, భరత్, కార్తీక్, సాయి, వాజీద్, లింగస్వామి, కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మికులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం

- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేసిన కౌన్సిలర్లు



కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ జావిద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఈమేరకు 10 మంది కౌన్సిలర్లు గురువారం సూర్యాపేట కలెక్టర్ కార్యాలయ పర్యవేక్షణ అధికారి జావిద్‌కు, నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ నీలగొండ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాలు అందజేశారు. నూతనంగా ఏర్పడిన నేరేడుచర్ల మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వీరిలో అవిశ్వాసం పెట్టాలని కోరుతూ 10 మంది సంతకాలు చేశారు. మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కొణతం చిన వెంకట్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు రణపంగ నాగయ్య, నూకల సుగుణ, బచ్చలకూరి ప్రకాశ్, బైరెడ్డి జితేందర్‌రెడ్డి, కుంకు సులోచన, సీపీఎం కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత, బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు అలక సరిత, బాణోతు లలిత, వేమూరి నాగవేణిలు కూడా అవిశ్వాసం పెట్టేందుకు మద్దతుగా సంతకాలు చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. దీంతో కౌన్సిలర్లు తీర్మానంపై చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకునే అవకాశం ఉంది. కలెక్టర్ ఆదేశాలు వచ్చిన వెంటనే నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

మూడు నెలలు సెలవు ఇవ్వాలని..

ఓ వైపు బీఆర్ఎస్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబుపై అవిశ్వాసం కోరుతూ కౌన్సిలర్లు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేయగా.. మరోవైపు అనారోగ్య కారణాలతో మూడు నెలల పాటు సెలవు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అవిశ్వాసంపై 10 మంది కౌన్సిలర్లు తీర్మానం చేసి కలెక్టరేట్‌లో ఇచ్చిన రోజే, చైర్మన్ కూడా సెలవు కోరుతూ దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

మోతె : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలను అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ధర్మపురి లక్ష్మయ్య కుటుంబాన్ని గురువారం సంతోష రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నందిగామ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ బొర్ర మధుసుదన్, మండల యూత్ అధ్యక్షుడు ఎలుగు వీరన్న, ఉప్పల వినోద్, నూకల రాజిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మోతె : మండల కేంద్రంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ మెట్టు అలివేలునారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొక్క ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిధులు మంజూరు చేయించి మోతె గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దోసపాటి రాములు, మాజీ సర్పంచ్‌లు గురిజాల వెంకన్న, ఇండ్ల జయమ్మవెంకన్న, బొల్లం రాములు, జలగం ఆంజనేయులు, బొడ్డు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామచిన వెంకటరెడ్డి, దోసపాటి చిరంజీవి, బొడ్డు సాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసం



బుక్స్ వివరాల పత్రాన్ని ప్రిన్సిపాల్‌కు అందజేస్తున్న ఫుడ్ ఫర్ థాట్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

హుజూర్‌నగర్ : పుస్తక పఠనంతో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి ఫుడ్ ఫర్ థాట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.50వేల విలువ గల పుస్తకాలను బహూకరించారు. ఆ సంస్థ నిర్వాహకురాలు మాధవీశర్మ, సమన్వయకర్త కావేరిలు ప్రిన్సిపాల్ భీమార్జునరెడ్డికి పుస్తకాలకు సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా భీమార్జున రెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనంపై యువతకు ఆసక్తి కలిగించడానికి ఫుడ్ ఫర్ థాట్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు నాగరాజు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

16న అయోధ్య అక్షింతల కలశాల శోభాయాత్ర

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వేదాంత భజన మందిరం నుంచి ఈ నెల 16వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు అయోధ్య అక్షింతల కలశాల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు అయోధ్య తీర్థ క్షేత్ర జిల్లా సంయోజకుడు పర్వతం శ్రీధర్ కుమార్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తోట గణేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని గీతా మందిరంలో ఏర్పాటు చేసిన అక్షింతల కలశాల పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

మాలధారులకు అన్నదానం



కోదాడరూరల్ : అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో గురువారం దాతల సహకారంతో సుమారు 600 మంది మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. పట్టణానికి చెందిన కొత్తూరు పూర్ణచందర్‌రావు, రాధా, గోళ్ల వెంకటేశ్వరరావు, నాగమణి కుటుంబసభ్యులు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబసభ్యులు, గురుస్వామి రామనాథం, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో ఉన్న గాలి రమేష్‌నాయుడు అయ్యప్ప సన్నిధానంలో మాలధారులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాన్ని గురువారం దాత పొట్ల నాగు చౌదరి, అయినాల అరుణ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని కోదాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్రా సుధారాణి పుల్లారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాలి శ్రీనివాసనాయుడు, గడ్డం సూర్యరెడ్డి, సీతారాంసింగ్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై కలెక్టర్ ఆరా



రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

నేరేడుచర్ల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అభివృద్ధి పనుల పురోగతిపై వ్యవసాయ శాఖ, మున్సిపల్ శాఖ, ఉపాధి హామీ పథకం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్‌కె జూవేదను రైతు బంధు నగదు జమ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మున్సిపల్ కమిషనర్ నీలిగొండ వెంకటేశ్వర్లును నేరేడుచర్ల మున్సిపాలిటీలోని రహదారుల విస్తరణ పనుల గురించి, ఉపాధి హామీ పథకం ఏపీఓ శేఖర్‌ను హరితహారం మొక్కల పెంపకానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, డిప్యూటీ తహసీల్దార్ నలబోలు స్రవంతి, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధిక వసూళ్లు చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



గరిడేపల్లి : మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

గరిడేపల్లి : మీ సేవా కేంద్రాల్లో చార్ట్‌పై ఉన్న ధరల కంటే అధిక వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గడ్డిపల్లి మీసేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు చార్ట్‌లో నమోదు చేసిన దానికంటే ఎక్కువ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఆయన వెంట డీటీసీఎస్ రాజశేఖర్, తహశీల్దార్ కవిత, ఆర్ఐలు సంపత్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల తనిఖీ



మునగాలలో మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే యాజమానులపై కఠిన చర్యలు ఉంటాయని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీసేవ నిర్వాహకులు దరఖాస్తుదారులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ రాధారెడ్డి, శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

ఆటో కార్మికులకు ఉపాధి కల్పించాలి



తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తాము జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం తమకు ఉపాధి అవకాశాలను కల్పించాలని ఆటో కార్మికులు కోరారు. ఈమేరకు గురువారం మండల తహసీల్దార్ సైదులుకు ఆటోయూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆటో కార్మికులు మాట్లాడుతూ ప్రతి ఆటో కార్మికుడిపై రూ. 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఆటో కార్మికులపై పోలీసుల వేధింపులు మానుకోవాలని, ఆటోలకు అడ్డాలు ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు నీలా రాంమ్మూర్తి, ఎస్‌కె అఫీస్, పాల్వాయి రమేష్, తీగల శ్రవణ్, పల్లె శాంతయ్య, సంజీవరెడ్డి, ఎస్‌కె మీరా, ఆజాం తదితరులు ఉన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



కోదాడఅర్బన్ : జేపీఎస్ వీధిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

కోదాడఅర్బన్ : కోదాడలో బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ వి డాక్టర్ వి యేసయ్య, గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు జగ్గునాయక్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొవ్వొత్తులతో ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ క్రిస్టియన్ కోఆప్షన్ సభ్యుడు ఒంటిపాక జానకీఏసయ్య, పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొల్లి కొండ కోటయ్య, హెడ్ కానిస్టేబుల్ జాన్, గిరిజన సామాజిక నాయకులు సైదానాయక్, విజయ్, ప్రసాద్, శారా, రాణి, మౌనిక, సీత, జ్యోతి, కోటేశ్వరి, శివ, రాంబాబు, వెంకీ, మోజస్, సునీత తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక సెమీ క్రిస్మస్

మత సామరస్యానికి, ఆధ్యాత్మికతకు ప్రతీక సెమీ క్రిస్మస్ వేడుకలని రిటైర్డ్ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం శెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని రోషమ్మ గారి వీధిలో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పాస్టర్ పోయిల సైమన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుమంత్, స్థానిక కౌన్సిలర్ ఫాతీమా ఖాజామోయినుద్దీన్, షేక్ నయీం, పంది తిరపయ్య, హ్యారీ గోన్స్, వెంకటయ్య, మనోజ్, నాగులు, మహేష్, ఇంద్రకరణ్, శెట్టి రవికుమార్, సైదమ్మ, రాము, పృథ్వీ, సంధ్య, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.




హుజూర్‌నగర్ రూరల్ : లింగగిరిలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన రెవా సిమియోన్

లింగగిరిలో..

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లింగగిరిలో లూథరన్ మిషన్ ఆఫ్ సాల్వేషన్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పరిశుద్ధ లూకా ఎవాంజెలికల్ సంఘంలో ఎన్ఎంఎస్‌హెచ్ సంస్థ ప్రెసిడెంట్ రెవ సోలోమన్, మామిడి రెవ సిమియోన్, మామిడి శామ్యేల్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాపోల్ ఫిలిప్, సంఘ కాపరి, సూపర్‌వైజర్ కుర్రి యేసురాజు, దేవసహాయం, దయాకర్, రవి, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి



రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి

అనంతగిరి : ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి కోరారు. గురువారం మండలంలోని చనుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో కొంత మేర కుటుంబ అవసరం కోసం చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుందన్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకవన్నారు. రాగులు, కొర్రలు, సామలు, అరికలు, జొన్నలు, సజ్జలు తదితర చిరుధాన్యాల సాగుపై యాజమాన్య పద్ధతులు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో రైతులు ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, నాగయ్య, నల్ల భీమారెడ్డి, క్లో క్రిష్టారెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.